శ్రీమతి కోపూరి మాణిక్యమ్మ స్మారక కథలపోటీలో
తృతీయ బహుమతి పొందిన కథ...

కథ

# స్వీట్ హోమ్

ఎం.ఆర్. అరుణకుమారి

"సుబ్బూ!"

"ఆ!?!"

"ఏంటా ఆశ్చర్యం...నోరు తెర్చుకు మరీ?"

"పేరు పెట్టి పిలుస్తుంటేనూ!"

"పిలవటానిక్కాదూ పేరుండేది?"

"ఆహా! మొగుణ్ని కూడానా?"

"బాధ్యతలు తీరాక సరదాలు గుర్తొచ్చాయిలే సుబ్బూ! ఐనా మొగుళ్ళు పెళ్ళాల్ని ఏమే, ఒసే, మ్మెయ్, అనోచ్చా? పెళ్ళాలు మాత్రం మొగుళ్ళను శుభ్రంగా, గౌరవంగా పేరుతో కూడా పిలవకూడదూ?"

"మంచిది. కానియ్. ఇంతకూ పనేమిటో?"

"ఏం లేదు సుబ్బూ! ఏంటలా ఆముదం తాగి నట్టు మొహం...నువ్వూ..."

"అబ్బే! నువ్వు మాటి మాటికి, మాట మాటకూ పేరెట్టి పిలుస్తున్నందుకు కాదు. ఇంకా మొహం కడగలేదులేగానీ...'పని' ఏమిటో చెప్పుమరి"

"ఆ...మహా...'పని' చేసి అలసి పోతున్నావులే!"

"అవ్వ! ఎవరేనా వింటే...మన పిల్లల్ని అనుమానించరూ?"

"అబ్బా...సుబ్బూ! పొద్దున్నే కుళ్ళు జోకులెయ్యకు. డోకొస్తుంది"

"నీకింకా డోకే ఓపికుండా గానీ...కాల్చుకు తినక విషయం చెప్ప రాదూ?"

"అదే...అదే...కాల్చటానికి...మురుకులు, పబ్బిళ్ళలూ...! పిల్లలు వస్తున్నారుగా బియ్యంపిండి కొట్టించుకురా సుబ్బూ...మిషనుకెళ్ళి. ఇవాళ బడికి శెలవు పెట్టాను. ఇద్దరం కల్సి...."

"హరే రామ! హరే కృష్ణ!"

"అప్పుడేనా? నేనూ రిటైరవుతున్నాగా! తర్వాత భజన మొదలెడదాంలే. ఐనా...ఆడుతూ, పాడుతూ పని చేస్తుంటే అలుపూ సొలుపూ వుంటాయా?"

"మోకాళ్ళ నొప్పులు, నడుం నొప్పులు మాత్రమేలే!"

"పిల్లలకోసం అప్పులు, తిప్పలు, నొప్పులు..ఎన్ని భరించలేదు మనం?

ఐనా...ఐదేళ్ళ తర్వాత అమెరికా నుంచొస్తున్నారు. వాళ్ళకిష్టమైనవి వండిపెడ్తే...అదో తృప్తి కాదూ!"

"నిజమేలే! మరి బియ్యం బకెట్ యిస్తే కదా వెళ్ళటానికి?"

"ఇదిగో సుబ్బూ! దార్లో పెత్తనాలొద్దు. త్వరగా వచ్చెయ్!"

"అలాగే! బాయ్!"

"ఊ! చెరువు కాదూ!"

"గుండె చెరువయ్యే బాధా వద్దు. బావిలో దూకే కష్టమూ వద్దు...ఏ తల్లిదండ్రుల క్కూడా."

"సుబ్బూ! ఏమిటి గొణుగుతున్నావ్?"

"ఏమీ లేదులే!"

"రిటైరయ్యాక నీకు ఆలోచనలెక్కువయ్యాయి"

"కాదు. ఒంటరితనం"

"ఇంకెంత? నాలుగురోజులు. నేనూ రిటైరైపోతున్నాగా! అప్పుడు ఎంచక్కా యిద్దరమూ పొద్దస్తమానూ..."

"లింగు, లిటుకూ మంటూ పోట్లాడుకొంటూ వుందామా...బుచ్చిలక్ష్మి, అప్పల్నాయుడ్లాగా?"

"పొద్దు పోవద్దూ మరి?"

"పొద్దు 'పోయే'దాకా మన మనస్సెరీరాలు, 'పోయాక' మన శవాలు...ఎదురు చూస్తూండాల్సిందేగా...పిల్లల కోసం?"

"సుబ్బూ! ఎందుకీ ఆరాటం? పిల్లలొస్తున్నారుగా?"

"ఆ...వస్తారు. ఎన్ని రోజులుంటారు? వాళ్ళ వాళ్ళ బంధుమిత్రులు, పనులూ...మనతో గడిపే రోజులెన్ని? అసలు వాళ్ళు వచ్చినట్లన్నా వుంటుందా?"

"నిజమే. కానీ...ఏం చేస్తాం? ఈ హైటెక్ యుగ జీవనశైలే పరుగుల మయం. అందులో ప్రస్తుత ప్రపంచ ఆర్థిక సంక్షోభంలో యువత కొత్త వుద్యోగాలటుంచి వున్న వుద్యోగాలెక్కడ వూడుతాయోనన్న తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతోంది. నా 'రిటైర్మెంట్ ఫంక్షన్' కొస్తామని ఆర్నెల్లుగా చెప్తున్నారు గానీ...నాకిప్పటికీ అనుమానమే...డబ్బు ఖర్చు...ఈ పరిస్థితుల్లో..."

"ఆ డబ్బుతో బాటు తమ కోరికలు, ఆశలు, కలలూ ఖర్చుపెట్టి వాళ్ళనింతవాళ్ళను చేసిన తల్లిదండ్రుల ప్రేమలు గుర్తురావా వాళ్ళకు?"

"ఎందుకంత బాధ సుబ్బూ! మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలేనని ఉడ్రో విల్సన్ ఎప్పుడో చెప్పాడుగా!"

"లేదు శారదా! అలా అనుకొంటే ఏ ఆర్థిక బంధానికి కట్టుబడి అమ్మానాన్నలు తమ పిల్లలకోసం అంత కష్టపడ్తారు?"

"స్వార్థం తోనే సుబ్బూ!"

"స్వార్థమా?!?"

"అవును. ఇక్కడ రెండు రకాల స్వార్థాలున్నాయి. ఒకటి. తమకంటే తమ పిల్లలు... అన్ని విధాలా వున్నంతంగా, సుఖంగా, సంతోషంగా వుండాలని...."

"అది స్వార్థమా?"

"ఒక రకంగా అంతే! ఇక రెండోది... కాలమంతా కష్టపడి... కదల్లేని... వృద్ధాప్యంలో తమకు ఆసరా అవుతారని ఆశించటం."

"అది తల్లిదండ్రుల ఆశేకాదు పిల్లల భాధ్యత కూడా. కానీ ఎంతమంది బిడ్డలు తమ బాధ్యతను గుర్తెరిగి ప్రవర్తిస్తున్నారు? ఎంతమంది తల్లిదండ్రులు తమ బిడ్డల ఆలనలో, మనవల పాలనతో..., హాయిగా, ఆనందంగా తమ మరు బాల్యం గడుపుతున్నారు? కనీసం తమ అంత్య క్రియలు కూడా బిడ్డల చేతుల్తో జరక్కపోతే...వారి ఆత్మలు క్షోభించవా? ఉద్యోగం పోతుందన్న భయంతో ఆస్ట్రేలియా నుంచి సంతోష్ రాలేకపోతే, సత్యానికి తలకొరివి పెట్టేవాళ్ళు లేక విద్యుత్ దహనం చేయడం నన్ను విపరీతంగా బాధించింది."

"ఆ రోజు నుంచి...నీకిలాంటి ఆలోచనలు ఎక్కువైపోయాయి. నేనెంత చెబ్తున్నా ...ఏం చెప్పినా నువు పట్టించుకోవట్లేదు. చూడు సుబ్బూ! కొన్ని సెంటిమెంట్లును చంపుకోవాలి. లేకపోతే అవి మనల్ని చంపుతాయి.

"చాలాబాగా చెప్పావు శారదా! చంపాలి. లేదా చావాలి. ఈ సమస్యకు పరిష్కారం అదే! పిల్లల ప్రేమ, ఆదరాభిమానాలు లేని బతుకు బతికే కంటే చావటమే మేలు."

"నీ అభిప్రాయం చాలా తప్పు సుబ్బూ! అలా అనుకొంటే ఈ భూమ్మీద ఎనభై శాతం తల్లిదండ్రులు చచ్చిపోవాల్సిందే! ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యక్తి కుటుంబాలొచ్చాక...తమను ప్రయోజకుల్ని చేసిన తల్లిదండ్రులకూడా తమ కుటుంబాల్లో స్థానం యివ్వట్లేదు ఈతరం. వాళ్ళను ఆదరించకపోయినా వర్లేదుగానీ... ఆస్తులకోసం...చంపకుండా ఉంటే పదివేలన్న పరిస్థితుల్లో...కాలానుగుణంగా పోవటమే విజ్ఞతగానీ ఆత్మహత్యలు చేసుకోవటం మూర్ఖత్వం కాదూ? అందులో బిడ్డల చేతుల్తో అంత్యక్రియలు జరగాలన్న చాదస్తంతో బిడ్డలు దగ్గరున్నపుడు ఆత్మహత్య చేసుకోవాలనుకున్న తండ్రిని...నిన్నే చూస్తున్నా!"

"నేనా! అబ్బే! ఛ! ఛ! ఏమంటున్నావు శారదా?"

"కంగారు పడకు సుబ్బరాజూ! ఊర్లోని సొంతింటిని పిల్లలకోసం అమ్మేసి, ఈ వూరిచివర అద్దె ఇంటి కొచ్చినప్పట్నుంచీ, నువు రిటైరై... పగలంతా ఒంటరితనంతో బాధపడ్తున్నప్పట్నుంచీ... మరీ...మీ స్నేహితుడు సత్యంగారు పోయినప్పట్నుంచీ...నీ ఆలోచనలు...చివరకీ నిర్ణయాన్ని తీసుకొన్నాయని నాకు తెలుసు సుబ్బూ! నీలో నువ్వే బాధపడ్తూ...రోజు రోజుకూ డీలా పడిపోతుంటే... యిహ విధిలేక నీ డైరీ చదివాన్లే! ఐనా సుబ్బూ! నీ మనస్సరీరాలు, కష్టసుఖాలు పంచుకొంటూ నలభై ఏళ్ళుగా నీతో సహజీవిస్తున్న నా గురించి ఆలోచించవద్దూ?"

"ఎందుకు లేదు? కానీ నీ ప్రాణం తీసుకోమనే హక్కునాకు లేదు".

"అవును. లేదు...నీ ప్రాణం తీసుకొనే హక్కు కూడా. ఒక్క విషయం ఆలోచించు సుబ్బు! ఈ జీవన ప్రస్థానంలో... ఐహికంగా, ఆద్యాత్మికంగా కూడా ప్రతి మనిషీ ఒంటరే! ఏ మనిషీ ఒంటరి కాదు. ఈ ప్రపంచంలోకి ప్రతి మనిషి ఒంటరిగానే వస్తాడు. ఒంటరిగానే పోతాడు. ఇది ఆద్యాత్మికత. ఐహికంగా ఆలోచిస్తే...జీవన ఆటుపోట్లు తట్టుకొనే తన స్థైర్యమే తనక్కు లేదు. ఆత్మబలం లేని మనిషి ఇతరులకు ఆసరా యివ్వలేడు. ఆదర్శమూ కాలేడు. చూడు సుబ్బూ! మనం చదువుకొన్నాం. ఇతరులకు బుద్ధులు, సుద్దులు చెప్పే పెద్దరికం, అనుభవం వున్నవాళ్ళం... మనమే దారితప్పటం తప్పు కాదూ?" "ఉహు! నా నిర్ణయం... నా మటుకు నాకు సమంజసంగా, సహజంగా అనిపిస్తోంది"

"బలవన్మరణం సహజమా? ఏ విధంగా సమంజసం? ఏ తల్లిదండ్రుల ప్రేమైనా బిడ్డల అభివృద్ధి కోరాలిగాని ఆటంకపర్చకూడదు. బిడ్డలు దూరంగా వున్నారన్న బాధ మనసుల్ని శూన్యం చేస్తుంది నిజమే. కానీ...ఆ వెలితిని భర్తీ చేసుకొనే దిశగా ఆలోచించాలి. గుండెల్లోంచి పెల్లుబికే మమతానురాగాలు మన రక్త సంబంధీకులకే పంచాలా? వేరే వారికి పంచకూడదా? చూడు...నిన్న టీకొట్టు దగ్గర...ఒక అమ్మచంకలో వున్న ఒక చిన్న పాప...నిన్ను 'తాతా అని పిలిస్తే...అమెరికాలో వున్న మనవరాలు గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయని బాధపడ్డావే గాని ఆ పాప నిర్మలంగా తన తాత కాని నిన్ను 'తాతా' అని పిల్చినా...ఒక తాతగా స్పందించావా? ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని మాట్లాడావా? కనీసం ఓ బిస్కెట్టో, చాక్లెట్టో కొనిచ్చావా? రాత్రి మనవరాలు ఫోన్లో సైకిలు కావాలని అడగ్గానే వెంటనే కొంటానని ప్రామిస్ చేశావు. కొంటావు కూడా. అదే...ఒకే ఒక రూపాయితో ఓ బిస్కెట్టో, ఓ చాక్లెట్టో...నిన్న..ఆ చిన్ని పాపకు కొనిచ్చి వుంటే...నీ మనసుకెంత సంతోషంగా వుండేదో! ఆ పాప మరెంత ప్రేమగా...నిన్ను చూసినప్పుడల్లా నవ్వుతూ కేరింతలు కొట్టేదో... అప్పుడు నీకెంత ఆనందంగా, వూరటగా... వుండేదో...వూహించు ఒక్కసారి."

"అంటే...నా మనవరాల్ని ఆ పాపలో చూసుకోమంటావు."

" 'నేను' అన్న అహంభావం, 'నాది' అన్న స్వార్థం వదిలేస్తే...ఏ పాపైనా 'మన' బిడ్డే అవుతుందంటున్నా."

"అంత విశాల హృదయం"

....."





**14-11-2009**న గుంటూరు అరసం జిల్లాశాఖ ఆధ్వర్యంలో శ్రీ తుమ్మల వెంకటరామయ్య సాహితీ సత్కారాన్ని కథా, నవలా రచయిత శ్రీ చిలుకూరి దేవపుత్రకు అందజేస్తున్న విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి డా॥ వి. రాంప్రసాద్, వేదికపై కథా, నాటిక రచయిత ఒల్లూరి శివప్రసాద్, మరియు అరసం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ

"అలవర్చుకోవటం అసాధ్యమేమీ కాదు. సంకుచిత, స్వార్థ ఆలోచనా పరిధిని విస్తృత పర్చుకొని 'నాది' నుంచి 'మన'కు ఎదగటమే విశాలత్వం. వయసూ, మేధస్సూ... పెరిగే కొద్దీ... మనసూ పరిణితి చెందాలి సుబ్బూ! రెక్కలొచ్చిన బిడ్డల్ని ఎగిరిపోయి స్వతంత్రంగా బతకమని గూట్లోంచి పొడిచి పొడిచి మరీ తీసేస్తాయట పక్షులు. మరి ఎదిగిన బిడ్డలు తమతోనే వుండాలని ఆశించటం, ఆదేశించటం మనిషి మూర్ఖత్వం కాదూ?"

"వృద్ధాప్యంలో బిడ్డల సేవ కోరుకోవటం మూర్ఖత్వం కాదు. అది మన హక్కు. వాళ్ళ బాధ్యత కూడా." ఆవేశ పడకు సుబ్బూ! హక్కుల, బాధ్యతల నిర్వహణ అవసరాలను బట్టి పరిస్థితులను బట్టి వుంటుందన్న వాస్తవాన్ని నువ్వు గ్రహించటం లేదు. సరే! నువ్వు బాధపడ్తున్న సత్యంగారబ్బాయి గురించే తీసుకొందా. తండ్రి మరణవార్త విని వెంటనే వచ్చేసి అంత్యక్రియలు చేసాడనుకొందాం. అదేం గొప్ప కాదు. అతని బాధ్యత కూడా. ఓకే! కానీ... అలా రావటం వల్ల అక్కడ వుద్యోగం పోయి, నువ్వన్నట్లుగా... యిక్కడికే వచ్చేసినా..., యిక్కడ తగిన వుద్యోగం దొరికే దాకా... భార్యా బిడ్డల్ని పోషించుకోలేక, మిగతా పరిస్థితులు తట్టుకోలేక తల్లడిల్లడమో... యిప్పుడు కొందర్ని చూస్తూనే వున్నాంగా... ఆత్మహత్య చేస్కోవటమే జరిగితే... ఆ తండ్రి ఆత్మ శాంతిగా వుండగలదా? క్షోభించదా? రాలేదని నిందించిన వారు అతనికి ఆసరా, ఆదరువూ అయ్యేవారా? ఆలోచించు."

"మీరైతే... మనమూ... దిక్కుమొక్కులేని అనాధ చావు చావాల్సిందే నంటావు!"

"అనాధలంటే... అయినవారు లేనివారు కాదు... ప్రేమ లేనివారే అంటారు కదా! సుబ్బు! ఆ ప్రేమను మనం ఎంతమందికి పంచితే... అంతమందీ మనకు అయిన వారే అవుతారు కదా! అప్పుడు మనం అనాధలమెలాగవుతాం? అవును సుబ్బూ! నేను మన భవిష్యత్ కాలాన్ని సద్వినియోగ పర్చే ప్లాన్‌లోనే వున్నాను. నేను రిటైరయ్యాక నీకు చెబుదామనుకున్నా! కానీ... ఈ లోపు నువ్వు యింతటి దారుణమైన నిర్ణయానికొస్తావని వూహించలేదు. థ్యాంక్ గాడ్! నీ డైరీ చదవటం... మంచిదే అయింది. చూడు సుబ్బూ! నువ్వు రిటైరవగా వచ్చిన డబ్బుతో అప్పులన్నీ తీర్చేశాం కదా! ఇప్పుడు నాకొచ్చే డబ్బుతో యిల్లు కొనుక్కొందాం. అందులో చిన్నపిల్లల క్రెచ్ పెడదాం. మనలాగా మనవలకోసం తపించే అవ్వా తాతలు ఈ పిల్లల్లో తమ మనవలను చూసుకొని ఆదరిస్తారు. అలాగే... బిడ్డలు దూరం చేసుకొన్న ఆశ్రయం లేక అల్లాడుతున్న అమ్మానాన్నల్ని చేరతీద్దాం. అందరం కలిసి... ప్రేమాభిమానాలను, కష్టసుఖాలను పరస్పరం పంచుకొందాం. ఏ ఒక్కరు పోయినా మిగతా వారంతా కలసి అంత్యక్రియలు, కర్మక్రియలు జరిపే ఏర్పాటు చేసుకొందా."




## విజ్ఞప్తి

**రచయితలు తమ రచనతోపాటు హామీపత్రాన్ని విధిగా జతచేసి పంపవలెను. అట్లు జతచేయని రచనలు పత్రికలో ప్రచురణకు స్వీకరించబడవు.**

"అంటే... 'ఎవరో' చేతుల్లో..."

"అబ్బా! మళ్ళీ మొదటికొచ్చావు సుబ్బూ! తన, పర అన్నది మన భావనలోనే గాని స్వచ్ఛమైన ప్రేమలో కాదు సుబ్బూ! స్పందనను బట్టే ప్రతి స్పందన వుంటుంది. ఐనా... నాది, నా వాళ్ళు అన్న బేషజాలు, అనుబంధ సంబంధాలు బొందిలో ప్రాణమున్నంత వరకే కాదా? బతికున్నపుడే ఎవరిదారి వారిదేగా బతికేవాళ్ళు చచ్చాక యమునా తీరే కాదూ? ఆ మాత్రానికి ఎందుకీ ఆరాటాలు, ఆందోళనలు, స్వార్థాలూ?"

"నిజమే కానీ..."

"ఆకు పసరు నీటికి, నీటి తేమ ఆకుకీ తగలకుండా తామరాకు మీద నీటిబొట్టులా బతకడానికి ఎంతో స్థిత ప్రజ్ఞత కావాలి సుబ్బూ! నదిలో నీటిని తాగుకో, సాగుకో... ప్రత్యేకం ఒక్క అవసరానికే తీసుకొమ్మని నది అంటుందా? మనలోని ప్రేమను ఆ పన్నులు పొందనీ. 'మన' పిల్లలకు మాత్రమే అని గిరిగీచుకోవటం వల్ల ఎవరికీ లాభముండదు కదా... యిలాంటి క్షోభలు తప్ప? మన మొట్టమొదటి గుర్తింపు 'మనిషి' గానే కదా!

'మనిషితనం' తో జీవిద్దాం... జీవముండేదాకా!"

"శారదా..."

"మనసు తేలికవుతోంది కదా! తల దిమ్మూ వదుల్తుంది. మంచి కాఫీ తెస్తానుండు."

"ఆగు శారదా! నా డైరీ చదివి నీలో నువ్వే ఎంత బాధపడ్డావో, నాకింతసేపు కౌన్సిలింగ్ చేసి మరెంత అలసిపోయావో... రిలాక్స్! నేనే వెళ్ళి కాఫీ కలుపుకొస్తానుండు." "నువ్వా?!?"

"చేతిలో పనులుంటే... బుర్రలో అనవసరపు ఆలోచనలుండవు గదా! చిన్నపిల్లలు, పెద్దపిల్లల్తో కలసి... రేపు మన యిల్లు... అనాధాశ్రమమా? ఓల్డేజ్ హోమా? బేబీకేర్ సెంటరా... ఏమనాలబ్బా?"

"ఊ. 'స్వీట్‌హోం' అందామా?"

"చాలా బాగుంది. ఆ స్వీట్‌హోంలో అందరూ పనిచెయ్యాలి కదా! నన్నిప్పట్నుంచీ నేర్చుకోనీ.. నీకు... కాదు... మనకు కాఫీ కలపటంలో"

"ఈ రోజు... ఈ క్షణం... నాకు చాలా సంతోషంగా వుంది సుబ్బూ! ఆనందంగా కూడా!

"కాఫీ కలుపుతానన్నందుకా?"

"నలభై ఏళ్ళలో మొదటిసారి కదా! అది సంతోషం. కానీ ఆనందం ఏమిటో తెలుసా... నా నిర్ణయాన్ని గౌరవిస్తూ...

నీ నిర్ణయం మార్చుకొన్నందుకు."